జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com




# రౌడీషీటర్ బొంగు మురళీపై.. పీడీ యాక్ట్

☀ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం ☀ శ్రీకాకుళం రౌడీలకు గట్టి హెచ్చరిక.. ☀ ప్రతి ఆదివారం రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్ ☀ అయినా కొందరిలో మార్పు రాని వైనం ☀ చాలామంది కౌన్సెలింగ్‌కు గైర్హాజరు

శ్రీకాకుళం క్రైం/సంతబొమ్మాళి, జులై 13 (వార్త): చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటివారైనా కటకటాలపాలవ్వాల్సిందే.. రౌడీయిజం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉక్కుపాదం తప్పదని ప్రభుత్వం మరోసారి నిరూపించింది. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం సున్నాపల్లి గ్రామానికి చెందిన, ప్రస్తుతం విశాఖపట్నం వేలంపేట ప్రాంతంలో నివాసముంటున్న రౌడీషీటర్ బొంగు మురళి (38) పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన పి.డి. యాక్ట్ (ప్రివెంటివ్ డిటెన్షన్)ను ప్రయోగించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ సోమవారం జీవో ఆర్టీ నంబర్ 1379 ద్వారా అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

## నేర చరిత్ర ఇదే..

విశాఖపట్నం పూర్ణామార్కెట్ సమీపంలోని పాండ వీధిలో నివాసముంటున్న బొంగు మురళి (తండ్రి రాజారావు) గత కొంతకాలంగా వరుస అసాంఘిక, రౌడీ పనులతో ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తున్నాడు. విశాఖ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ పరిధితో పాటు పలుచోట్ల ఇతనిపై తీవ్రమైన కేసులు నమోదయ్యాయి. సమాజ శాంతికి భంగం కలిగిస్తున్న ఇతని ప్రవర్తనపై నిఘా ఉంచిన విశాఖపట్నం పోలీస్ కమిషనర్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్, ఈ నెల 2వ తేదీన మురళిపై పీడీ యాక్ట్ కింద డిటెన్షన్ ఆర్డర్ జారీ చేశారు. ఇందుకు అనుగుణంగానే ఈ నెల 8న ప్రభుత్వానికి నివేదిక పంపారు.

## ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్.. సెంట్రల్ జైలుకు ఆదేశాలు

కమిషనర్ నివేదికను, మురళి నేర తీవ్రతను క్షుణ్ణంగా పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ బూట్‌లెగ్గర్స్, డకాయిట్స్, డ్రగ్ అఫెండర్స్, గూండాలు, ఇమ్మోరల్ ట్రాఫిక్ అఫెండర్స్ అండ్ ల్యాండ్ గ్రాబర్స్ చట్టం-1986 (యాక్ట్ నం.1/1986) లోని సెక్షన్ 3(2), సెక్షన్ 2(జ) నిబంధనల ప్రకారం ఈ పీడీ యాక్ట్ ఉత్తర్వులకు తక్షణ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం విశాఖపట్నం సెంట్రల్ జైలులో ఉన్న మురళికి ఈ ఉత్తర్వులను వెంటనే అందజేయాలని, అతనికి అర్థమయ్యే భాషలో చదివి వినిపించి, సంతకం తీసుకోవాలని జైళ్ల సూపరింటెండెంట్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

## శ్రీకాకుళం రౌడీషీటర్లకు గట్టి హెచ్చరిక..

సొంత జిల్లా శ్రీకాకుళం అయినప్పటికీ, విశాఖ కేంద్రంగా అక్రమాలకు పాల్పడుతున్న మురళిపై పీడీ యాక్ట్ నమోదు కావడం స్థానిక రౌడీ మూకల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. శ్రీకాకుళం జిల్లా సరిహద్దుల్లో గానీ, రాష్ట్రంలో ఎక్కడైనా గానీ రౌడీయిజం పేరిట తోక జాడిస్తే.. పీడీ యాక్ట్ కోరలు చాచడానికి సిద్ధంగా ఉందనే బలమైన సందేశాన్ని ఈ ఉత్తర్వుల ద్వారా పోలీస్ యంత్రాంగం పంపింది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఎంతటివారికైనా ఇదే గతి పడుతుందని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రతి ఆదివారం పోలీస్‌స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండి,నేర ప్రవృత్తికి స్వస్తి పలికి, సత్ప్రవర్తనతో నడుచుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఎటువంటి కారణాలు లేకుండా ఘర్షణలు సృష్టించిన ప్రతి ఒక్కరిపై పోలీస్ వారి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఎవ్వరైనా ఎక్కడైనా గొడవలు, ఇతర నేరాలలో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు. అయినప్పటికీ కొందరి మార్పు రావడం లేదు. ఇప్పటికీ కొందరు భూదందాలు, సెటిల్‌మెంట్లు చేస్తున్నారు. ప్రతి ఆదివారం నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావడం లేదని పోలీసులు చెబుతున్నారు. జిల్లాలోని పలు పీఎస్‌లలో కొందరు మహిళలపై కూడా రౌడీషీట్లు ఉన్నాయి.



క్రైం వార్తలు

# పోలీసుల ఎదుట లొంగిపోయిన.. మాజీ మంత్రి సీదిరి కుమారుడు



☀ సీసీ ఫుటేజి వెలుగులోకి ☀ దానయ్య కుటుంబాన్ని పరామర్శించిన ఇన్‌చార్జీ మంత్రి కొండపల్లి, ఎమ్మెల్యే శిరీష ☀ పది లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన టీడీపీ ☀ తప్పును కప్పిపుచ్చే ప్రయత్నం చేసిన అప్పలరాజుపై చర్యలకు ఆదేశాలు ☀ కొడుకును కాపాడేందుకు మరో నేరం: ఎమ్మెల్యే శిరీష

పలాస, జులై 13 (వార్త): వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు ఆరవ్ న్యాయవాదులతో వచ్చి కాశీబుగ్గ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. కాశీబుగ్గలో ఈ నెల 10న జరిగిన బైక్ ప్రమాదంలో గొర్రెల కాపరి దానయ్య (45) మృతికి ఆరవ్ కారణమని పోలీసులు గుర్తించారు. అతివేగంతో బైక్ నడిపి ఢీకొట్టినట్లు పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన రోజు రాత్రి 9.07 గంటల సమయంలో ఆరవ్ ఒక్కడే బంకుకు వెళ్లి బైక్‌లో పెట్రోల్ పోయించుకున్నట్లు, ఆ తర్వాత ఆసుపత్రిలో తండ్రితో కలిసి ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం వెళ్లినట్లు సీసీటీవీ ఫుటేజీ దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ఆయా సీసీటీవీ ఫుటేజీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## మృతుడు దానయ్య కుటుంబానికి పది లక్షలు ఎక్స్‌గ్రేషియా: మంత్రి కొండపల్లి

ఇటీవల మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కుమారుడు ఆరవ్ చేసిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గొర్రెల కాపరి దానయ్య కుటుంబానికి టీడీపీ తరఫున పది లక్షల రూపాయలు పరిహారం అందిస్తామని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి, శ్రీకాకుళం ఇన్చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి దానయ్య కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సీదిరి అప్పలరాజు కుమారుడు చేసిన ప్రమాదాన్ని తారుమారు చేస్తూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం దారుణమన్నారు. అప్పలరాజుపై చట్టపరమైన చర్యలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అనేక సంఘటనలను రాజకీయంగా మాట్లాడే అప్పలరాజు సొంత కుమారుడు చేసిన తప్పును కప్పిపుచ్చటానికి ప్రయత్నం చేయటం ఆక్షేపించదగిన విషయం కాదన్నారు. నీతి మాటలు వల్లించే అప్పలరాజు రోడ్డు ప్రమాద సంఘటనను తప్పుదోవ పట్టించటం బాధాకరమైన విషయం అన్నారు. వైసిపి నాయకుల పరిస్థితిని గమనించినట్లయితే గతంలో డ్రైవర్ను చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును కాపాడిన చరిత్ర వైసీపీకి ఉందన్నారు. మంత్రి వెంట పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, ఏపిటిపిసి చైర్మన్ వజ్జ బాబురావు, జిల్లా గ్రంధాలయం చైర్మన్ పీరుకట్ల విఠలరావు, గాలి కృష్ణారావు, నరేంద్ర (చిన్ని ), బడ్డ నాగరాజు, అంబటి కృష్ణమూర్తి, లోడగల కామేశ్వరరావు, కుత్తుమ్ లక్ష్మణ్ కుమార్ కూటమి నాయకులు ఉన్నారు.



## కొడుకును కాపాడేందుకు మరో నేరం: శిరీష



పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుపై పలు తీవ్రమైన ఆరోపణలు చేశారు. టీడీపీ కార్యాలయంలో మీడియాతో ఆమె మాట్లాడుతూ ప్రమాదానికి కారణమైన ఆరవ్ వర్మను చట్టపరమైన చర్యల నుంచి తప్పించేందుకు ప్రయత్నించారని, అతని స్థానంలో స్నేహితుడు సిద్ధార్థ్‌ను పోలీసుల ఎదుట నిలబెట్టే ప్రయత్నం జరిగిందని ఎమ్మెల్యే ఆరోపించారు. ఇది కేవలం ప్రమాద ఘటన మాత్రమే కాకుండా, చట్టాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నంగా కూడా చూడాల్సిన అంశమన్నారు. దర్యాప్తులో అన్ని ఆధారాలు బయటకు వస్తాయని, నిజాలు ప్రజల ముందుకు వస్తాయని తెలిపారు. ప్రతిపక్షాలపై తరచూ విమర్శలు చేసే మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, తన కుటుంబానికి సంబంధించిన విషయంలో మాత్రం చట్టాన్ని ప్రభావితం చేసే ప్రయత్నం చేశారని ఎమ్మెల్యే ఆరోపించారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# భవాని ఐటీఐపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల వెల్లువ

**కంచిలి, జులై 13(వార్త):** అవినీతి, అక్రమాలపై అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న కంచిలిలోని భవాని ప్రైవేట్ ఐటీఐపై కలెక్టర్ గ్రీవెన్స్ లో సోమవారం మూడు ఫిర్యాదులు నమోదయ్యాయి. ఐటీఐలో అక్రమాల బాగోతంపై ఇప్పటికే తారస్థాయిలో పత్రికల్లో వార్తలు రావడం, అనంతరం పలు రాజకీయ పార్టీల నేతలు ఐటీఐ కళాశాలను సందర్శించడం విద్యార్థులతో మాట్లాడి వాస్తవాలు తెలుసుకున్న విషయం విదితమే.



### పూర్తిస్థాయి విచారణ జరిపించాలి : శ్యాం ప్రసాద్ రెడ్డి

భవాని ప్రైవేట్ ఐటీఐలో జరుగుతున్న అవకతవకలు, అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని శ్రీకాకుళంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో జేసీకి ఇచ్ఛాపురం వైసీపీ కన్వీనర్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి ఫిర్యాదు చేశారు. విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రాక్టికల్స్ కూడా విద్యార్థులకు నిర్వహించడం లేదని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌కు కళాశాలపై ఫిర్యాదు అందజేశారు.

### ఒక్కో విద్యార్థి నుంచి 10,000 అదనం : ఇప్పిలి కృష్ణారావు

కంచిలి మాజీ ఎంపీపీ ఇప్పిలి కృష్ణారావు కూడా సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్ లో భవాని ఐటీఐపై ఫిర్యాదు చేశారు. ఒక్కో విద్యార్థి నుంచి ఏడాదికి 10 వేల




రూపాయలు అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఉపకార వేతనాలు విద్యార్థులకు చెల్లించకపోవడం దారుణమన్నారు. గతం నుంచి కళాశాల ఇదే విధమైన అక్రమాలతో నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఐటీఐలో తాగునీరు, మరుగుదొడ్లు లేకపోవడం దారుణమని ఫిర్యాదు చేశారు. యాజమాన్యంపై సరైన చర్యలు తీసుకొని విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

### వార్తలు రాసినందుకు పోలీసు నోటీసులు :

కంచిలో భవాని ఐటీఐ అక్రమాలను వెలుగులోకి తేవడంపై జీర్ణించుకోలేని యాజమాన్యం పోలీసులు ద్వారా నోటీసులు ఇప్పించడం ఎంతవరకు సమంజసం అని ఉద్దానం పత్రిక ఎడిటర్ భావన శ్రీకాంత్ తో పాటు శ్రీకాకుళం చెందిన వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. జర్నలిస్ట్ సంఘాల నాయకులు నాయుడు, ఈశ్వరరావు, ఎన్.బాబురావు తదితరులు గ్రీవెన్స్‌లో దీనిపై ఫిర్యాదు చేశారు. అనేక అక్రమాలతో పాటు విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు కూడా నిర్వహించడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. మాస్ కాపీయింగ్, హాజరు సర్దుబాటు, రికార్డుల మేనేజ్మెంట్ కోసం అక్రమంగా వివిధ రకాల ఫీజులు విద్యార్థుల నుంచి దోచేస్తున్నారని ఫిర్యాదుల పేర్కొన్నారు. వృత్తి ధర్మాన్ని పాటిస్తున్న జర్నలిస్టులపై పోలీసుల ద్వారా వేధించడం తగదని పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

## రాజపురం హాస్టల్‌కు 5 ఫ్యాన్లు వితరణ



**కవిటి, జులై 13(వార్త):** రాజపురంలో గల బీసీ బాలురు హాస్టల్ కు ఐదు సీలింగ్ ఫ్యాన్లను పలువురు వితరణగా అందజేశారు. ఎంపీపీ కడియాల పద్మా ప్రకాష్ రెండు ఫ్యాన్లు, కంచిలి ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి రెండు ఫ్యాన్లు, రాజపురం గ్రామానికి చెందిన సాయిరాం భక్తుడు ఒక సీలింగ్ ఫ్యాన్ ను అందించి తమ ఉదారతను చాటుకున్నారు. కొద్ది రోజుల క్రితం ఇదే హాస్టలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గం సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి ఆకస్మికంగా పరిశీలించిన విషయం విదితమే. హాస్టల్లో కనీస సౌకర్యాలు సక్రమంగా లేకపోవడం, ప్రభుత్వం పట్టించుకోకపోవడం మొదలైన కారణాలను ఎత్తిచూపారు. దీనిపై శ్రీకాకుళం కలెక్టర్ గ్రీవెన్స్ లోను ఫిర్యాదులు కూడా చేసి హాస్టల్ను తీర్చిదిద్దాలని కోరారు. ఈ నేపథ్యంలో పలువురు నాయకులు స్పందిస్తూ హాస్టల్లో విద్యార్థుల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని తక్షణంగా ఫ్యాన్లు అందించడం పట్ల రాజపురం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నేతలు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా హాస్టల్ అధికారి ఉపేంద్ర వెంటనే స్పందించి తన సొంత డబ్బులతో మరుగుదొడ్లు, శానిటేషన్ పనులు చేయించడం పట్ల నేతలు అభినందించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి హాస్టల్లో ఇతర సమస్యలపై వెంటనే దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని స్థానిక నాయకులు కోరారు.

## గ్రామాల్లో.. స్వచ్ఛరథం.. సూపర్‌హిట్



**జి.సిగడాం, జులై 13(వార్త):** గ్రామాలను ప్లాస్టిక్ వ్యర్థాల రహితంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం వినూత్న కార్యక్రమం స్వ చ్ఛరథం సూపర్ హిట్ అయ్యిందని గ్రామ నీటి సంఘం అధ్యక్షురాలు మీసాల విజయమ్మ, కూటమి టిడిపి నాయకులు మక్క నారాయణరావు అన్నారు. సోమవారం స్వచ్ఛ రథం పెంట గ్రామాన్ని సందర్శించి గ్రామంలో ప్రజల వద్ద ఉన్న వ్యర్థాలను కొనుగోలు చేసి తగిన ఖరీదు కు లబ్ధిదారులకు నిత్యవసర వస్తువులను అందజేస్తున్నారు. వాటర్ బాటిళ్లు, పాలిథీన్ సంచులు, పాడైన ప్లాస్టిక్ వస్తువులు.. ఇలా ఇంట్లో పనికిరాని వాటిని బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా.. స్వచ్ఛరథం ద్వారా సేకరిస్తున్నారు. వ్యర్థాలు తీసుకుని ఇచ్చే నిత్యావసరాల్లో.. పప్పు, ఉప్పు, చింతపండు, సబ్బులు వంటివి ఉంటున్నాయి. ప్రతి గ్రామ పంచాయతీలో తిరుగుతూ ప్రజల నుంచి వ్యర్థాలను సేకరించి నిత్యవసర వస్తువులను అందిస్తున్నారు. ప్రజలు ఈ స్వచ్ఛ రథాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మీసాల రమణ, డొల పార్వతీ, మక్క సాయి, రత్నాలు, డోల వైకుంఠరావు, ఉన్నారు.

## ఆటో ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

### -ఒకరి పరిస్థితి విషమం



**మందస, జులై 13(వార్త):** మందస-హరిపురం రోడ్డులో జరిగిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి ప్రమాదకరంగా మారింది. వివరాలిలా ఉన్నాయి. మందస మండలంలోని హరిపురానికి వెళ్లే దారిలో పితాతొళి జంక్షన్ వద్ద ఆటో ఢీకొని ఇదే మండలంలోని లొహరిబంద గ్రామానికి చెందిన నర్తు వెంకటరమణ, తులసమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. మందస 108 వాహనంలో ఇద్దరినీ హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. వెంకటరమణ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్సకు పలాస తరలించారు. తులసమ్మకు హరిపురం సీహెచ్ సీలో వైద్యులు చికిత్స చేస్తున్నారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## జి.పెంటలో పారిశుధ్య చర్యలు



**జి.సిగడాం, జులై 13(వార్త):** పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యకరంగా ఉంటామని ఎంపీడీఓ జి.రామకృష్ణారావు అన్నారు. సోమవారం జి. పెంట గ్రామంలో అన్ని వీధుల్లో పారిశుధ్య సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టి పిచ్చి మొక్కలు, డ్రైనేజీల్లో చెత్త చెదారం తొలగించి శుభ్రం చేయిస్తున్నామని గ్రామ నీటి సంఘం అధ్యక్షురాలు మీసాల విజయమ్మ, కూటమి నాయకులు మక్క నారాయణరావు పేర్కొన్నారు. మురుగు కాలువ పూడిక తీత, పిచ్చి మొక్కల తొలగింపు పనులు చేయించారు. వీధుల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చేయాల్సిన పనులను పంచాయి కార్యదర్శి అల్లాడ దుర్గారావు కు సూచించి త్వరగా చేయాలని తెలిపారు. మక్క నారాయణరావు మాట్లాడుతూ గ్రామ అభివృద్దే లక్ష్యంగా పారిశుధ్య పై ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల మౌలిక సదుపాల అబివృద్ధి చేస్తున్నామని దీనికి ప్రజల సహకారం కూడా అవసరమని అన్నారు. అనంతం త్రాగునీటి వాటర్ ట్యాంకర్‌ల్లో క్లోరినేషన్ చేపట్టారు. దోషములు వ్యాప్తి చెందకుండా వాకింగ్ నిర్వహించారు. బావులు, బోర్లు,కాలువల్లో బ్లీచింగ్ చల్లారు. మీసాల రమణ, డొల పార్వతి ఉన్నారు.





## శ్రీముఖలింగేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ

### - ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు

**జలుమూరు, జులై 13(వార్త):** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన జలుమూరు మండలం శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వర (మధుకేశ్వర) స్వామి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. నిజ జ్యేష్ఠ మాసం కృష్ణ పక్ష చతుర్దశి, స్వామివారికి ప్రీతిపాత్రమైన ఆరుద్ర నక్షత్రం ఒకే రోజున రావడంతో తెల్లవారుజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి ఏడుకొండలు మాట్లాడుతూ, ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శన ఏర్పాట్లు, తాగునీరు, క్యూలైన్ల నిర్వహణ తదితర సౌకర్యాలను కల్పించినట్లు వివరించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య శ్రీముఖలింగేశ్వర స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా పలువురు భక్తులు మాట్లాడుతూ, ఇలాంటి పుణ్య తిథి, ఆరుద్ర నక్షత్ర యోగం వందేళ్ల తర్వాత రావడం విశేషమని, ఈ రోజున స్వామివారిని దర్శించుకోవడం అత్యంత పుణ్యప్రదమని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. దీంతో ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

## రైతుల చందాలతో చెరువు షట్టర్లకు మరమ్మతులు

### - అధికారుల నిర్లక్ష్యంతోఁ బసివాడలో నీరు వృధా

### - పంటలకు సాగునీరందించేందుకు రైతుల స్వచ్ఛంద చర్య



**జలుమూరు, జులై 13(వార్త):** బసివాడ గ్రామంలోని పెద్ద చెరువుకు ఉన్న షట్టర్లు దెబ్బతినడంతో చెరువులోని నీరు దిగువకు వృథాగా వెళ్లిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పలుమార్లు సంబంధిత అధికారులకు సమస్యను తెలియజేసినా స్పందన లేకపోవడంతో చివరకు రైతులే స్వచ్ఛందంగా నిధులు సమీకరించి షట్టర్లకు మరమ్మతులు చేయించారు. గ్రామానికి సమీపంలోని నడగాం ఛానల్‌కు అనుసంధానంగా ఉన్న చెరువు షట్టర్లు పాడవడంతో నీటి నిల్వ లేకుండా దిగువకు పారిపోతున్నట్లు రైతులు తెలిపారు. దీంతో సాగునీటి కొరత ఏర్పడి పంటలకు అవసరమైన నీరు అందక ఇబ్బందులు ఎదురయ్యాయని వాపోయారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లి షట్టర్లను మరమ్మతు చేయాలని కోరినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని రైతులు ఆరోపించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో మరింత నీరు వృథా కాకుండా ఉండేందుకు గ్రామ రైతులే చందాలు సేకరించి మరమ్మతు పనులు చేపట్టారని తెలిపారు. రైతుల సహకారంతో



షట్టర్లు బాగు కావడంతో చెరువులో నీటి నిల్వ సాధ్యమవుతుందని, సాగునీటి అవసరాలు కొంత మేర తీరనున్నాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సాగునీటి వనరుల పరిరక్షణపై సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

## శ్రీముఖలింగేశ్వరుడిని దర్శించుకున్న ఎస్‌డీసీ

### -నిత్య అన్నదాన పథకానికి రూ.7 వేల విరాళం అందజేత

### - ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అధికారులు



**జలుమూరు, జులై 13(వార్త):** శ్రీముఖలింగంలో వెలసిన శ్రీముఖలింగేశ్వర స్వామివారిని విశాఖ జిల్లాకు చెందిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బొడ్డేపల్లి వెంకటరమణ సోమవారం సతీసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఏడుకొండలు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బొడ్డేపల్లి వెంకటరమణ రూ.7 వేల నగదును విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఏడుకొండలకు అందించి అన్నదాన కార్యక్రమానికి తన వంతు సహకారం అందించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేసి సత్కరించారు. భక్తులు నిత్య అన్నదాన పథకానికి విరాళాలు అందించడం ద్వారా సేవా కార్యక్రమాలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని ఆలయ అధికారులు తెలిపారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

## విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలి

### - ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలి : ఎంఈఓ మాధవరావు

### - జలుమూరు మండలంలోని పాఠశాలల తనిఖీ



**జలుమూరు, జులై 13(వార్త):** పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతో పాటు చదవడం, రాయడం నైపుణ్యాలపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని జలుమూరు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) బమ్మిడి మాధవరావు సూచించారు. సోమవారం జలుమూరు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించి విద్యా బోధన, విద్యార్థుల అభ్యాస స్థాయిని పరిశీలించారు. పెద్దదూగాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల చదవడం, రాయడం సామర్థ్యాలను పరీక్షించి వారి నైపుణ్యాలను అంచనా వేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి స్పష్టంగా చదవడం నేర్చుకోవడంతో పాటు చక్కటి రాతతో వ్రాయగలిగే నైపుణ్యాన్ని కూడా పెంపొందించుకోవాలని అన్నారు. ఇందుకోసం ఉపాధ్యాయులు ప్రతిరోజూ ప్రత్యేక సాధన నిర్వహించి విద్యార్థుల అభ్యాస పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థుల్లో ప్రాథమిక అభ్యాస సామర్థ్యాలను మెరుగుపరచడం ద్వారా ఉన్నత విద్యకు బలమైన పునాది ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ చూపుతూ విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల బోధన విధానం, హాజరు వివరాలు, విద్యార్థుల అభ్యాస స్థాయిపై ఆయన ఆరా తీసి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

## విద్యుత్ తీగలపై వేలాడుతున్న చెట్ల కొమ్మలు

### - బొంతు జంక్షన్‌లో ప్రమాదాన్ని తలపిస్తున్న పరిస్థితి

### - తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికుల డిమాండ్



**సారవకోట, జులై 13(వార్త):** బొంతు జంక్షన్‌లో ప్రధాన విద్యుత్ లైన్‌పై చెట్ల పచ్చని కొమ్మలు వేలాడుతూ ప్రమాదకర పరిస్థితిని సృష్టిస్తున్నాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనన్న భయంతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న విద్యుత్ తీగలను చెట్ల కొమ్మలు తాకుతున్నప్పటికీ సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నిర్లక్ష్యం ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని వారు అంటున్నారు. గాలులు, వర్షాలు వీచే సమయంలో చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై మరింత ఒత్తిడి కలిగించి విద్యుత్ అంతరాయం, షార్ట్ సర్క్యూట్ లేదా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో నిత్యం వాహనాలు, పాదచారులు రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదం మరింత తీవ్రమయ్యే అవకాశముందని పేర్కొంటున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారకముందే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ లైన్లను ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి, అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదకర పరిస్థితిని వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

### - నీటి ట్యాంకును పరిశీలించిన ఎంపీడీవో మురళీమోహనరావు

### - బ్లీచింగ్ పౌడర్ వినియోగంతో పరిశుభ్రత పాటించాలని ఆదేశం

**సారవకోట, జులై 13(వార్త):** వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సారవకోట ఎంపీడీవో మురళీమోహనరావు సూచించారు. సోమవారం సారవకోట మండలం ధర్మలక్ష్మీపురం గ్రామ సచివాలయం పరిధిలోని మంచినీటి ట్యాంకును ఆయన పరిశీలించారు. ట్యాంకు నిర్వహణ, పరిశుభ్రత, నీటి నిల్వ విధానాలను పరిశీలిస్తూ సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. మంచినీటి ట్యాంకులను నిరంతరం శుభ్రపరచడంతో పాటు తప్పనిసరిగా బ్లీచింగ్ పౌడర్ వేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో కలుషిత నీటి కారణంగా వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున నీటి నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు సురక్షితమైన, పరిశుభ్రమైన తాగునీరు అందేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ నిర్వహించాలని తెలిపారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# రథయాత్రకు సర్వం సిద్ధం



**ఇచ్ఛాపురం, జులై 13(వార్త):** జ్యేష్ఠపౌర్ణమి రోజున భక్తుల సమక్షంలో మహాభిషేకాలు అందుకుని ఆపై చందనాలంకరణతో జరిగిన ఉత్సవం అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్గించని స్వామివారు నవయవ్వనరూపంతో మంగళవారం అందరినీ అలరించనున్నారు. ఈ ఉత్సవాన్నే నేత్రోత్సవం. నవయవ్వన రూప దర్శనం అని భక్తులు భావిస్తారు. రథయాత్రకు ముందు అమావాస్య పర్వదినాన ఈ వేడుకలను నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. విశ్వవిఖ్యాత జగన్నాథస్వామివారి రూపాన్ని తనివితీరా దర్శించుకుని, స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించేందుకు ఎదురుచూస్తున్నారు. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల కనువిందు చేసేలా శోభాయమాన నవయవ్వన రూపాన్ని అలంకరిస్తూ ఒడిశా 'మహాపాత్రో' కుటుంబీకులు ఆధ్యాత్మిక జీవనం సాగిస్తున్నారు. ఈ ఉత్సవానికి వర్ణాలంకరణే ప్రధాన అంశం పూరీ క్షేత్రం తరహాలోనే ఇక్కడ కూడా రహస్యమందిరంలో స్వామివారిని కొలువుతీర్చి నిత్యారాధనలు ఏకాంతంగా అర్చకులే జరిపారు. జగన్నాథునికి ప్రీతికరమైన అన్నప్రసాదం ఉండదు. దానికి బదులుగా వడపప్పు, పానకం తదితర ఔషధ ఆహార పదార్థాలను నివేదించారు. కాగా స్వామివారికి నవ యవ్వన రూపాన్ని తీసుకు వచ్చేందుకు వనమూలికలతో మహాపాత్రో కుటుంబం సేవలందించారు. ఒడిశాకు చెందిన వీరు వంశపారంపర్యంగా ఈ సేవలలో పాల్గొంటున్నారు. ఇవి బజారులో లభించే రంగులు కావు. కొండకోనల్లో లభ్యమయ్యే ఆకులు, ఆకుపసరు, జిగుర్తు, వేర్లు ఉపయోగించి కొన్ని రకాల సిండి పదార్థాలను చెట్ల జిగురులతో కలగలపి తయారుచేసే వర్ణాలు నల్లని ముఖవర్చస్సుతో జగన్నాథస్వామి, తెల్లని తెలుపులో బలభద్రస్వామి పసుపువర్ణంలో సుబద్రాదేవిలను రూపుదిద్దారు.

## నేడు నేత్రోత్సవం

జ్యేష్ఠపౌర్ణమి ముందురోజునే స్వామివారి దైవత్వాన్ని మంత్రపూర్వకంగా ఒక పూర్ణకుంభంలోకి గ్రహించారు. గర్భగుడిలో కుంబానికే నిత్యపూజాదికాలు, నివేదనలు జరుగుతుంటాయి పూర్ణకుంభంలోని దైవత్వాన్ని తిరిగి విగ్రహ రూపాలలోకి మంత్రపూర్వకంగానే తీసుకు వచ్చే ప్రక్రియ రెండురోజులుగా సాగింది. ఈ ఘట్టం మంగళవారం ఉదయం పూర్తవుతుంది. జగన్నాద, బలభద్ర, సుబద్ర, సుదర్శనమూర్తులతో పాటు చిన్నజగన్నాథ స్వామి వారు భక్తులకు సంపూర్ణ కళలతో దర్శనమివ్వనున్నారు. ఉదయం 11గంటలకు స్వామివారిని తొలుత దర్పణంలో బింబ దర్శనం చేసుకుని, ఆపై నేరుగా దర్శిస్తారు. పూజలనంతరం అన్ని మహాప్రసాదం వినియోగం ఉంటుంది.


## 16న రథయాత్ర

జగన్నాథస్వామివారి రథయాత్ర ఉత్సవం గురువారం సాయంత్రం జరుగుతుంది. ఇందుకోసం పెద్ద రథం, చిన్న రథాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మరో వైపు గుడించా మందిరం (చిన్నజగన్నాథస్వామి ఆలయం)ను కూడా శోభాయమానంగా అలంకరిస్తున్నారు.

# ట్రాక్టర్ బోల్తా.. కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

**- గొనపుపేట సమీపంలో రోడ్డు ప్రమాదం**

**- రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన పశ్చిమబెంగాల్ యువకుడు**



**నరసన్నపేట, జులై 13(వార్త):** నరసన్నపేట మండలం గొనపుపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికుడు మృతి చెందినట్లు ఎస్సై-2 వి. లక్ష్మీనారాయణ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన షేక్ ఇబ్రహీం (30) స్థానికంగా కాంట్రాక్ట్ విద్యుత్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి ట్రాక్టర్‌పై చెన్నాపురం వైపు వెళ్తుండగా గొనపుపేట సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన ఇబ్రహీంను వెంటనే శ్రీకాకుళం ప్రభుత్వ రిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై-2 వి. లక్ష్మీనారాయణ తెలిపారు.


# ఉపాధ్యాయ సమస్యలపై నేడు ఫ్యాప్టో నిరసన





**శ్రీకాకుళం, జులై 13(వార్త):** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీ, ఐఆర్, ఇతర ఆర్థిక డిమాండ్ల సాధన, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపునకై జిల్లా ఫ్యాప్టో ఆధ్వర్యంలో 80 ఫీట్ రోడ్ నుంచి కలెక్టరేట్ వరకు మంగళవారం ఉదయం 9 గంటలకు నిరసన ర్యాలీ ప్రారంభమవుతుందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మామిడి భుజంగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్ బుక్కూరు వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతరం పికెటింగ్ నిర్వహిస్తామన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా సబ్ కమిటీ సభ్యులు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు, జిల్లా కౌన్సిలర్లు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

# జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు పలాస క్రీడాకారులు




**పలాస, జులై 13 (వార్త):** జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలుకి పలాస క్రీడాకారులు పాల్గొంటున్నారని స్కేటింగ్ కోచ్ గోపాల్ కృష్ణ తెలిపారు. ఈ నెల 17వరకు కాకినాడలో జరుగుతున్న జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు జిల్లా నుంచి పలాస చెందిన జక్కల.తోషిని రాయ్, అట్టడ అయ్యన్, నారాయణ సెట్టి పార్తు సాయి, మార్పు సుభాష్ లకు అవకాశం లభించింది అని చెప్పారు. ఈ పోటీలు వోరల్డ రోలర్ స్కేటింగ్ ఫేడరేషన్ ఆఫ్ ఇండియా, ఆంధ్ర ప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ వారి అధ్వర్యంలో నిర్వహిస్తారని కోచ్ గోపాల కృష్ణ తెలిపారు. శ్రీకాకుళం రోలర్ స్పోర్ అసోసియేషన్ కార్యదర్శి బి.చంద్రావతి క్రీడాకారులను అభినందించారు.

# ఎరువులు రైతులకు సక్రమంగా అందాలి

**- ఏవియేషన్ హబ్‌నకు స్థల పరిశీలన**

**- పలాస ఆర్డీఓ ఆర్.అప్పలరాజు**

**మందస, జులై 13(వార్త):** రైతులకు ఎరువులు సక్రమంగా అందాలని పలాస ఆర్.డి.ఓ. ఆర్.అప్పలరాజు ఆదేశించారు. మందస మండలంలోని బాలిగాం వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాన్ని సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఒక్క రైతు కూడా ఎరువుల కొరతతో ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. ఖరీఫ్ సీజన్ కు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలన్నారు. అనంతరం ఎరువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయాధికారి జి.నాగరాజుతో ప్రత్యేకంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ కు రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. ఎప్పటికప్పుడు వివరాలను అప్ లోడ్ చేయాలన్నారు. అనంతరం హరిపురంలో ఏవియేషన్ ల్యాబ్ నిర్మాణానికి అనువైన స్థల పరిశీలన చేశారు. హరిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ల్యాబ్ ఏర్పాటునకు స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కింతలి రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, బాలిగాం పీఏసీఎస్ ఛైర్మన్ లబ్బ రుద్రయ్య, సీఈఓ రాళ్లపేట పార్వతీశం, రెవెన్యూ సిబ్బంది, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



# రూ.4.33 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం



**పోలాకి, జులై 13(వార్త):** నరసన్నపేట నియోజకవర్గంలోని గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి సర్వాంగసుందరంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. పోలాకి మండలంలోని పలు గ్రామాల్లో రూ.4.33 కోట్ల వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను శుక్రవారం ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి బగ్గు అర్చనతో కలిసి కేంద్ర మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గొల్లలవలస--డీపీఎన్ బీటీ రహదారి, దీర్ఘాశి--గొల్లలవలస బీటీ రహదారి, కొల్లివలస--మబగాం సీసీ రోడ్లు, మబగాం--కాంచీపేట సీసీ రోడ్డు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్, జల్ జీవన్ మిషన్ కింద రక్షిత మంచినీటి పథకాలను ప్రారంభించారు. అలాగే మబగాం కాలనీలో కొత్త నీటి సరఫరా పథకానికి శంకుస్థాపన చేశారు. అనంతరం హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆభా కార్డుల జారీ, వైద్య సేవలు, ఫర్నిచర్ తదితర సౌకర్యాలపై జిల్లా వైద్యాధికారులను అడిగి తెలుసుకుని అవసరమైన వసతులు కల్పించాలని ఆదేశించారు. సభలో మాట్లాడిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, గొల్లలవలస, దీర్ఘాశి, మబగాం గ్రామాల ప్రజలు తమపై చూపుతున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల అవసరాలను గుర్తించి రోడ్లు, తాగునీటి పథకాలు, ఆరోగ్య కేంద్రాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాలను దశలవారీగా కల్పిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. పెన్షన్‌ను రూ.4 వేలుకు పెంపు, తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు ఆర్థిక సాయం వంటి సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు, కొత్త పెన్షన్ల మంజూరు కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పంట కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేసే విధానాన్ని ప్రభుత్వం కొనసాగిస్తోందని చెప్పారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ నరసన్నపేట నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజలు కోరిన ప్రతి అభివృద్ధి పనిని దశలవారీగా పూర్తి చేస్తున్నామని, గ్రామాల్లో రోడ్లు, తాగునీటి పథకాలు, ఆరోగ్య కేంద్రాలు, కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయిస్తోందని తెలిపారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సహకారంతో నియోజకవర్గానికి మరిన్ని అభివృద్ధి నిధులు తీసుకువచ్చి ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి నృత్య పోటీల్లో కీర్తన ప్రతిభ

**- నాలుగు బహుమతులు కైవసం**

**మందస, జులై 13(వార్త):** కళామతల్లి ముద్దు బిడ్డ నారాయణశెట్టి శైలజ. కళారంగంలో శైలజ విశేష కృషి చేస్తున్నారు. కాళ్లకు గజ్జె కట్టి, నర్తించడమే కాకుండా.. వారసత్వం ఎందరో కళాకారులకు శిక్షణ ఇస్తున్నారు. ఆ కళాకారులు కూడా కళామతల్లి సేవలో తరిస్తున్నారు. మందసకు మంచి పేరు తీసుకువస్తున్నారు. ఒకప్పుడు మందస అంటే



పాలకోవాకు గుర్తింపు పొందగా.. నేడు మందస అంటే నాట్యమని కూడా గుర్తింపు పొందుతోంది. నాట్య గురువు శైలజ ఆధ్వర్యంలో శిష్యులు మంచి ప్రతిభ చూపుతున్నారు. విశాఖపట్నంలో నాట్యారవళి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 37వ జాతీయ స్థాయి నృత్య పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో మందసకు



చెందిన యువ నర్తకి కుమారి కీర్తన విశేష ప్రతిభ కనబరిచారు. డాక్టర్ ఉమ్మిడి మహేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో దేశం నలుమూలల నుంచి 683 మంది కళాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలకు ఆంధ్ర విశ్వవిద్యాలయం సీనియర్ నృత్య ప్రొఫెసర్ డాక్టర్ విజయవేణి, ప్రముఖ నృత్య గురువు నటరాజ పరమేశ్వరన్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. నాట్యగురువు నారాయణశెట్టి శైలజ శిక్షణలో పాల్గొన్న కీర్తన ఈ పోటీల్లో మొత్తం నాలుగు బహుమతులు కైవసం చేసుకున్నారు. కూచిపూడి, జానపద విభాగాల్లో ప్రథమ బహుమతులు, సినీ క్లాసికల్, సినీ ఫోక్ విభాగాల్లో ద్వితీయ బహుమతులు సాధించి తన ప్రతిభను చాటుకున్నారు. ఇప్పటికే గత ఏడాది నిర్వహించిన దూరదర్శన్ బి-గ్రేడ్ ఆర్టిస్ట్ పరీక్షల్లో కూడా కీర్తన అర్హత సాధించారు. అలాగే వరుసగా పలువురు జాతీయ స్థాయి నృత్య పోటీల్లో విజయాలు సాధిస్తూ తన ప్రతిభను నిరూపించుకుంటున్నారు. తమ ప్రాంతానికి చెందిన నర్తకి జాతీయ వేదికపై మెరిసి వరుసగా నాలుగు బహుమతులు సాధించడంతో మందస ప్రాంత కళాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ, కీర్తనకు అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు.

# కొత్తపేట ప్రభుత్వ పాఠశాలకు కుర్చీల వితరణ

**మందస, జులై 13(వార్త):** మందస మండలంలోని లొహరిబంద పంచాయతీలో గల కొత్తపేట మోడల్ ప్రాథమిక పాఠశాలకు దాతలు కుర్చీలు అందజేశారు. 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు, కొంతమంది గ్రామస్తుల సహకారంతో పాఠశాలకు 30 కుర్చీలను సోమవారం పాఠశాలకు ఉదారతగా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కుత్తుం ప్రకాశరావు మాట్లాడుతూ స్థానిక గ్రామ ప్రజలు సహకారం ఉంటే పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి పథంలోకి నడిపించవచ్చని అన్నారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి దాతలు, పూర్వ విద్యార్థులు ఇదే పాఠశాలలో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించిన విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ అడతాల సోమేశ్వరరావు, వైస్ చైర్మన్ హైమావతి, ఉపాధ్యాయులు దున్న రామారావు, సీహెచ్ సావిత్రి, ఎస్.వజీర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్ విరాళం


**-రూ.40 వేల కంప్యూటర్ అందజేసిన ప్రైవేటు సంస్థ**

**- డిజిటల్ విద్యాభివృద్ధికి సహకారం**




**సారవకోట, జులై 13(వార్త):** చిన్నగుజ్జువాడ ప్రాథమిక పాఠశాలకు సోమవారం ఓ ప్రైవేటు సంస్థ ముఖ్య నిర్వాహకుడు మహేష్ రూ.40 వేల విలువైన కంప్యూటర్‌ను విరాళంగా అందజేశారు. విద్యార్థులకు డిజిటల్ విధానంలో నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో ఈ కంప్యూటర్‌ను అందించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాలల్లో డిజిటల్ విద్యను ప్రోత్సహించడం ద్వారా విద్యార్థుల అభ్యాస నైపుణ్యాలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు కంప్యూటర్‌ను విద్యార్థుల బోధనలో సమర్థవంతంగా వినియోగించి, సాంకేతిక ఆధారిత విద్యను అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ విరాళం పాఠశాల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) భూలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు సురేష్, విశ్రాంతి ఉపాధ్యాయులు, స్థానిక ప్రముఖులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం పాఠశాల యాజమాన్యం ప్రైవేటు సంస్థ నిర్వాహకుడు మహేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# పదోన్నతిపై బాధ్యతలు చేపట్టిన అధ్యాపకులు



**నరసన్నపేట, జులై 13(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పదోన్నతి పొందిన నలుగురు అధ్యాపకులు, లైబ్రేరియన్ సోమవారం తమ విధుల్లో చేరినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దాడ లత తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధ్యాపకులను ఆమె అభినందించి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. కళాశాల విద్యా ప్రమాణాల పెంపునకు ప్రతి అధ్యాపకుడు తనవంతు కృషి చేయాలని సూచించారు. పదోన్నతిపై కామర్స్ విభాగంలో డాక్టర్ హెచ్. మల్లేశ్, తెలుగు విభాగంలో గిరిబాబు, రసాయన శాస్త్ర (కెమిస్ట్రీ) విభాగంలో హేమంత్ కుమార్ అధ్యాపకులుగా, బి. సురేంద్ర లైబ్రేరియన్‌గా బాధ్యతలు స్వీకరించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామని అధ్యాపకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# కుమ్మరిపేట ప్రాథమిక పాఠశాల తనిఖీ



**నరసన్నపేట, జులై 13(వార్త):** నరసన్నపేట మండల విద్యాశాఖ అధికారి ఉప్పాడ శాంతారావు సోమవారం కుమ్మరిపేట ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ, విద్యార్థుల అభ్యాస స్థాయిని పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించిన అనంతరం విద్యార్థుల తెలుగు, ఇంగ్లిష్, గణిత సబ్జెక్టుల్లోని అభ్యాస సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థుల నేర్చుకునే స్థాయిని అంచనా వేసి, బోధనలో మరింత నాణ్యత పెంచేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శ్రద్ధతో బోధన అందించాలని, ఆకర్షణీయమైన, విద్యార్థి కేంద్రిత బోధనా పద్ధతులను అమలు చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రతి విద్యార్థి ప్రాథమిక అభ్యాస నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు నిరంతర పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, ప్రతి విద్యార్థి పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో ఉప్పాడ శాంతారావు సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.సురేఖ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# యూనిఫాంలు, బెల్టుల పంపిణీ

**నరసన్నపేట, జులై 13(వార్త):** రావులవలస పంచాయతీ పరిధిలోని గుండివిల్లిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు యూనిఫాంలు, బెల్టులు పంపిణీ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు తెలిపారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) చైర్మన్ రెడ్డి అనురాధ విద్యార్థులకు యూనిఫాంలు, బెల్టులు అందజేశారు. ప్రభుత్వ పథకాల ద్వారా విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం వల్ల వారికి ప్రోత్సాహం లభిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పాఠశాలలో వివిధ తరగతుల్లో మొత్తం 40 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నట్లు హెచ్ఎం కృష్ణారావు వివరించారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పాఠ్యపుస్తకాలను కూడా విద్యార్థులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువులో రాణించాలని, తల్లిదండ్రులు కూడా పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని ఉపాధ్యాయులు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# పాపం.. 108 అంబులెన్స్ పైలట్ మురళీమోహన్

**-నిష్కారణంగా బాధితుడయ్యారు**

**-చేయని నేరానికి శిక్ష**

**- ఆసుపత్రిలో చికిత్స**

**పొందుతున్న వాయలపల్లి**

**మందస, జులై 13(వార్త):** కాలం కలిసి రాకపోతే తాడు పామై కాటు వేస్తుందని పెద్దలు సామెత చెబుతారు.. అంతేకాదు, శమంతకమణి దొంగిలించాడని శ్రీకృష్ణునికి కూడా నింద తప్పలేదు. భగవంతుడు కూడా చేయని నేరానికి శిక్ష అనుభవించాడని పురాణాలు చెబుతుండగా.. మానవ మాత్రులమైన మనమెంతా.. అంటూ వృద్ధులు పేర్కొంటుంటారు. మందస మండల 108 పైలట్ వాయలపల్లి మురళీమోహన్ కు సరిగ్గా ఇదే జరిగింది. ఏ పాపం ఎరుగని మురళీమోహన్ బాధిడయ్యారు. ఉద్యోగ నిర్వహణలో నిబద్ధత కలిగిన 108 పైలట్ మురళీమోహన్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. మందస మండలంలోని మఖరజోల గ్రామానికి చెందిన వాయలపల్లి మురళీమోహన్ కు మంచి డ్రైవర్ గా పేరుంది. సుదీర్ఘ కాలం పాటు 108 అంబులెన్స్ పైలట్ గా పని చేసిన మురళీ మంచి సేవలు అందించారు. కానీ.. దురదృష్టవశాత్తూ దాడిలో గాయపడ్డారు. మందస మండలంలోని మందస-హరిపురం రహదారిలో పితాతొల్లి జంక్షన్ వద్ద ఆటో, ద్విచక్ర వాహనాల ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో లొహరిబంద గ్రామానికి చెందిన వెంకటరమణ, తులసమ్మ అనే ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో వెంకటరమణ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ప్రమాద సమాచారాన్ని తెలుసుకుని, మందస 108 అంబులెన్స్ సిబ్బంది గోపాలకృష్ణ, మురళీమోహన్ చేరుకుని, క్షతగాత్రులను హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. అయితే, ఇక్కడే ఓ ట్విస్ట్ జరిగింది. లొహరిబంద బాధితులకు సంబంధించిన కుటుంబీకులు, బంధువులు హరిపురం సీహెచ్ సీకు చేరుకున్నారు. ఆటో డ్రైవర్ ఎక్కడ ఉన్నారని బాధితుల బంధువుల ఆరా తీస్తున్న సమయంలో ఎవరో పొరపాటున 108 అంబులెన్స్ మురళీమోహన్ అక్కడున్న వారు చూపించడంతో ఒక్కసారిగా.. బాధిత బంధువులు మురళీమోహన్ పై దాడి చేశారు. ఒక్కసారిగా జరిగిన సంఘటనకు మురళీమోహన్ నివ్వెరబోయారు. ఒక్క మాట కూడా మాట్లాడడానికి అవకాశంలేకపోవడంతో మురళీమోహన్ దెబ్బలకు తాళలేక స్పృహ కోల్పోయారు. జరిగిన సంఘటనకు అక్కడున్న వారంతా ఏం జరుగుతోందనని ఆశ్చర్యపోయారు. స్పృహ తప్పి కోల్పోయిన మురళీమోహన్ ను హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో



చేర్పించారు. వైద్యులు చికిత్స అందజేశారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం ఆసుపత్రికి మురళీమోహన్ ను తరలించారు. కాగా.. ఈ సంఘటనపై 108 అంబులెన్స్ సిబ్బంది యూనియన్ నాయకులు మందస పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నడూలేని విధంగా జరిగిన ఈ సంఘటనపై యూనియన్ నాయకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. 108 అంబులెన్స్ వ్యవస్థ వచ్చినప్పటి నుంచి పని చేస్తున్నామని, ఎప్పుడూ ఇటువంటి సంఘటన జరుగలేదని తెలిపారు. మురళీమోహన్ పై జరిగిన దాడిని వారు ఖండించారు.

## టీబీ నిర్ధారణ శిబిరం విజయవంతం



**పలాస, జులై 13 (వార్త):** ప్రతి ఒక్కరి సంక్షేమమే లక్ష్యంగా నిర్వహించిన క్షయ రహిత భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉచిత టిబి (టీబీ) నిర్ధారణ వైద్య శిబిరం విజయవంతంగా బొడ్డపాడులో సోమవారం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు టిబి వ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన వారికి ఉచిత పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు అందించారు. ప్రజలందరూ టిబి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకుని, ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కిక్కర ఢిల్లీరావు (కేడిఆర్), పిఏసిఎస్ డైరెక్టర్ బొడ్డు దుష్యంత్, కుత్తుం హేమలయ్య, నెయ్యిల జగబందు, పత్తిరి అప్పలస్వామి, రాజాం అప్పలస్వామి, బొమ్మాళి పద్మ, గేదెల జగ్గమ్మ, వంకల పాపయ్య, కుత్తుశీ కళావతి, బొమ్మాళి రత్నకుమారి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఐకమత్యం ఎంతో ఆనందదాయకం

**- ఎయిర్ పోర్టు నిర్మాణానికి భూములివ్వం**

**-పోలీసు విచారణతో సమావేశానికి వెళ్లలేకపోయా**

**- బత్తిని లక్ష్మణ**



**మందస, జులై 13(వార్త):** రైతుల ఐక్యమత్యం ఎంతో ఆనందదాయకమని, ఎయిర్ పోర్టు నిర్మాణానికి భూములివ్వమని కార్గో ఎయిర్ పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ మీడియా వింగ్ కన్వీనర్ బత్తిని లక్ష్మణ్ అన్నారు. మందస మండలంలోని హరిపురంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణానికి రైతులు వ్యతిరేకంగా ఉన్నారని, కేంద్రమంత్రి సమక్షంలో కూడా ఐకమత్యంతో భూములివ్వమని చెప్పడం ఐక్య పోరాటాలకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమానికి పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడంతోనే సమావేశానికి వెళ్లలేకపోయానని చెప్పారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఏర్పాటు చేసిన బహిరంగ సభకు మీ అందరితో కలిసి హాజరు కాలేకపోయినందుకు నాకు ఎంతో బాధగా ఉందన్నారు. మన భారత ప్రజాస్వామ్య దేశంలో భారత రాజ్యాంగం, చట్టాలను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యతని, ఆ బాధ్యతను నేను కూడా పాటించాల్సి ఉందన్నారు. గత నెల మీలగంగువాడ గ్రామసభకు సంబంధించి నాపై నమోదు చేసిన కేసు విచారణ నిమిత్తం రెండోసారి నిన్న మందస పోలీస్ స్టేషన్‌కు హాజరు కావాలని పోలీసులు సూచించారు. అందువల్ల ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలీసుల విచారణకు పూర్తిగా సహకరిస్తూ పోలీస్ స్టేషన్‌లోనే ఉండాల్సి వచ్చిందన్నారు. నేను సభకు రాలేకపోయినా, మీరందరూ ఒక్కటై "కార్గో ఎయిర్‌పోర్ట్ కోసం సెంటు భూమి కూడా ఇవ్వం" అనే మన సంకల్పాన్ని గట్టిగా వినిపించడం నాకు ఎంతో సంతోషాన్ని, గర్వాన్ని కలిగించిందన్నారు. మన పచ్చని ఉద్యానం హక్కుల కోసం, రైతుల భూముల రక్షణ కోసం మన పోరాటం చట్టబద్ధంగాను, ఐక్యంగాను కొనసాగిద్దామన్నారు. భవిష్యత్ ఇదే స్ఫూర్తితో కొనసాగాలని పిలుపునిచ్చారు.

## టీడీపీ పట్టణ కార్యదర్శి

## నాగరాజుపై చర్యలు తీసుకోవాలి

**- జర్నలిస్టుపై దాడిని ఖండిస్తూ నిరసన జ్వాల**

**- మహాత్మా గాంధీ విగ్రహం నుంచి బైక్ ర్యాలీ**

**- ఆర్డీఓకు వినతిపత్రం**

**పలాస, జులై 13 (వార్త):** విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుపై జరిగిన దాడిని నిరసిస్తూ శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గానికి చెందిన వివిధ జర్నలిస్టు సంఘాలు సోమవారం మహాత్మా గాంధీ విగ్రహం వద్ద భారీ ఆందోళన చేపట్టాయి. అక్రమ మట్టి తవ్వకాల కవరేజ్‌కు వెళ్లిన బిఆర్కే టీవీ పలాస న్యూస్ రిపోర్టర్ యవ్వారి తిరుమలపై జరిగిన దాడి కేసులో ఇప్పటి వరకు నిందితులపై చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన జర్నలిస్టులు మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపి అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. జులై 9వ తేదీ రాత్రి జేసీబీలతో అక్రమంగా మట్టి తవ్వి టిప్పర్ల ద్వారా తరలిస్తున్న దృశ్యాలను విధి నిర్వహణలో భాగంగా చిత్రీకరిస్తున్న సమయంలో బిఆర్కే టీవీ పలాస న్యూస్ రిపోర్టర్ యవ్వారి తిరుమలపై కొందరు దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై బాధిత జర్నలిస్టు కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటి వరకు నిందితులపై చర్యలు తీసుకోలేదని జర్నలిస్టు సంఘాలు ఆరోపించాయి. సోమవారం పలాసలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద జర్నలిస్టులు పెద్దఎత్తున చేరుకుని దాడిని ఖండిస్తూ నినాదాలు చేశారు. "జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి", "దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి", "విధి నిర్వహణలో ఉన్న మీడియాపై దాడులు ఆపాలి" అంటూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మహాత్మా గాంధీ విగ్రహం నుంచి కాశీబుగ్గ పాత బస్టాండ్ మీదుగా పలాస ఆర్డీఓ కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొని బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధిత జర్నలిస్టు యవ్వారి తిరుమలకు న్యాయం చేయాలని, కేసు దర్యాప్తును వేగవంతం చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘాల నాయకులు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న మీడియా ప్రతినిధులపై దాడులు ప్రజాస్వామ్యానికి ముప్పు అని పేర్కొన్నారు. వార్తలను ప్రజలకు చేరవేసే జర్నలిస్టుల భద్రతను ప్రభుత్వం, పోలీసు శాఖ నిర్ధారించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి టీడీపీ పలాస మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేశాయి. దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పలాస నియోజకవర్గానికి చెందిన వివిధ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాధిత జర్నలిస్టుకు సంఘీభావం ప్రకటించారు.



## కలకలం రేపిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

**శ్రీకాకుళం, జులై 13(వార్త):** శ్రీకాకుళం నగరంలోని మత్స్యశాఖ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న పాత భవనంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించడం కలకలం రేపింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో దుర్వాసన వస్తుండటంతో స్థానికులు అనువమానించి మత్స్యశాఖ అధికారుల కుసమాచారం అందించారు. సమాచరం అందుకున్న అధికారులు పాత భవనం వద్దకు వెళ్లి పరిశీలించగా, అక్కడ ఉబ్బిపోయిన స్థితిలో ఓ మృతదేహం కనిపించింది. దీంతో అధికారులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. అనంతరం సంబంధిత పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిసింది. మృతుడు ఎవరు, ఆయన అక్కడికి ఎలా చేరుకున్నారు, మృతి ఎప్పుడు సంభవించింది అనే విషయాలపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.



## ఇచ్ఛాపురం గ్యాస్ ఏజెన్సీని అర్బన్‌లోకి మార్చండి



**ఇచ్ఛాపురం, జులై 13(వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిధి లోగల వివిధ సమస్యలను కలక్టరేట్ గ్రీవియన్స్ కార్యక్రమం లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ దృష్టికి నియోజకవర్గ వైస్సార్సీపీ ఇన్‌ఛార్జ్ సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి తీసుకు వెళ్ళారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో ఎల్‌పిజి సిలిండర్‌లు ప్రభుత్వ ఆదేశాలు అనుసరించి అర్బన్ ప్రాంతాలలో 25 రోజులలో ప్రజలకు బుకింగ్ అవకాశం కల్పించాలని ఉండగా, ప్రస్తుతం 45 రోజులు సమయం పడుతుందని, వెంటనే ఏజెన్సీని అర్బన్ పరిధి లోకి మార్చాలని కోరారు. ఇచ్ఛాపురం పట్టణం లోని రామకృష్ణ రీడింగ్ రూమ్ లో బుక్స్ మరియు వసతులు ఏర్పాటు చేయగలరని ,కంచిలి మండలం లోని ప్రైవేట్ ఐ టి ఐ కాలేజీ వ్యవహారం పై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపించగలరని కోరారు. కవిటి మండలం రాజపురం బిసి హాస్టల్ లో విద్యార్థుల ఇబ్బందులు పరిష్కారం కొరకు వసతులు మెరుగు పరచాలని. సోంపేట మండలం, బారువా నందు గత ప్రభుత్వం లో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ లో తరగతులు మరల ప్రారంభించగలరని అదేవిదంగా నాలుగు మండలాల విద్యార్థులకు ఉపయోగపడే విదంగా కంచిలి కిలొకేషన్ మార్చగలరని కోరారు. బారువా పంచాయతీ కు ఎలక్ట్రికల్ పవర్ సప్లై గతంలో మాదిరిగా సోంపేట సబ్ స్టేషన్ నుండి ఏర్పాటు చేయాలని, కవిటి మండలం రాజపురం పి హెచ్ సి లో సిబ్బంది నియామకం కొరకు , ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పెరుగుతున్న కాన్సర్ కేసులు ప్రాథమిక దశలో గుర్తించడానికి కాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నియోజకవర్గంలోని అన్ని ఆసుపత్రి లలో ఏర్పాటుచేయాలని, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ 1వ వార్డ్ లో గల ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు రవాణా సదుపాయంకు సరిపడా అదనపు బస్సులు ఏర్పాటు చేయలని, ప్రస్తుతం బారువా 10 పడకల సామజిక ఆసుపత్రి లో వసతులు మెరుగు పరచాలని అదేవిదంగా గత ప్రభుత్వం ప్రారంభించిన నిర్మాణం పనులు పూర్తి చేసి 30 పడకల ఆసుపత్రిని తీర ప్రాంతం ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని, బారువా ప్రభుత్వ ఉన్నత పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణం పనులు, టాయిలెట్స్ సదుపాయం తదితర వసతులు ఏర్పాటు చేయాలని జింకిభద్ర పరిసర గ్రామాలలోని నష్ట పోయిన టమోటా రైతులకు నష్ట పరిహారం త్వరగా చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోంపేట వైస్ ఎంపీపీ గుర్రాల శ్రీను, బారువా 2 ఎంపీటీసీ ప్రతినిధి తమాడ విశ్వనాధ్(బుజ్జి) పాల్గొన్నారు.

## సర్‌ను 3 నెలల పాటు పొడిగించాలి

**- సీపీఐ నాయకులు చాపర సుందర్ లాల్**



**పలాస, జులై 13 (వార్త):** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో అర్హులైన ఓట్ల గల్లంతు, ఫారాల నింపడంలో ఇబ్బందులు, బీఎల్ ఓల అలసత్వం, రాజకీయ ప్రమేయం వంటి ప్రధాన సమస్యలు వెలుగుచూస్తున్నాయని కాబట్టి ఈ ప్రక్రియను మరో మూడు నెలలు పొడిగించాలని సిపిఐ నాయకులు చాపర సుందర్ లాల్, లండ వెంకటరావులు కోరారు. ఈ మేరకు సోమవారం పలాస ఆర్డిఓ కార్యాలయం ఏవో భాగ్యవతికు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 14న రాష్ట్రంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తవుతుందని ప్రకటించారని, గడువు ముగింపు దశకు చేరుకున్నప్పటికీ ఇంకా చాలా మంది ఓటర్ల వివరాలు నమోదు కాకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగం ప్రజలకు సార్వత్రిక ఓటు హక్కును కల్పించిందని, ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమం చేపట్టక ముందు అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయడానికి ప్రాధాన్యమిచ్చారని, ఫోటో గుర్తింపు కార్డులు లేకున్నా ఓటరు జాబితాలో పేరుంటే చాలు, వేరే ఏదైనా గుర్తింపు పత్రంతో ఓటు వేసే వెసులుబాటు కల్పించబడిందని,దీని వలన పౌరులందరికీ ఓటుహక్కు ఉండేది. దేశంలో దీర్ఘకాలం నివసించి భారతీయ పౌరసత్వం పొందిన వారు తప్ప, విదేశీయులెవరూ ఓటు వేసేందుకు వీలుండేది కాదన్నారు. కాని ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐర్) కార్యక్రమం దానికి గండికొడుతోందని, మరణించిన ఓటర్ల పేర్లను, శాశ్వతంగా వలస పోయిన వారిని, నకిలీ ఓటర్లను తొలగించడం ఎస్ఆర్ ఉద్దేశమని ఎన్నికల కమిషన్ చెబుతున్నప్పటికీ, వాస్తవం అందుకు భిన్నంగా ఉంటున్నదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఫొటో గుర్తింపు కార్డు ఉన్న ఓటర్లు తమ 'ఎపిక్' స్థితి గురించి ఎన్నికల సంఘం వెబ్ సైట్ లో వెతికితే 'ఎలాంటి ఫలితం లభించలేదన్న సమాధానం వస్తోందని, బహుశా వారి పేర్లను ఉద్దేశ పూర్వకంగా లేదా అనుకోకుండా తొలగించి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు . నిజమైన ఎపిక్ కార్డు ఉన్న వారికి ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వనందువల్ల తాజా ముసాయిదా జాబితాలో పేర్లు కనిపించని దుస్థితి నెలకొందని, ఏదైనా రాజకీయ కారణంతో ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్ వోలు అప్ లోడ్ చేయకపోతే వారి ఓట్లు గల్లంతయ్యే ప్రమాదముందన్నారు. మరి కొందరు ఓటర్ల పేర్లు ప్రస్తుత జాబితాలలో ఉన్నప్పటికీ ఏదైనా కారణం వల్ల ప్రభుత్వం ఆ ప్రాంత వాసులను వేరే చోటికి తరలిస్తే, వారు కొత్త నియోజకవర్గంలోకి వస్తారంటూ బీఎల్వోలు ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వటం లేదని అందువల్ల వారి పేర్లూ అదృశ్యమయ్యాయని పేర్కొన్నారు. సర్ వల్ల ఓటరు జాబితాల నుంచి అదృశ్యమైన అర్హులు అసలు ఎప్పటికైనా ఓటర్లుగా గుర్తింపు పొందగలరా..? లేదా అనే సందేహం ఎదురవుతోందని, ఇంటింటి సర్వే ద్వారా ఓటర్లను నమోదు చేయాల్సింది పోయి, సర్ పేరుతో ఎన్యూమరేషన్ ఫారాలు నింపాలనడంతో ఎంతో మంది ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి తలెత్తిందన్నారు. అర్హులైనవారు ఓటు హక్కు కోల్పోవడం ప్రజాస్వామ్యానికి పెను విఘాతం అని అన్నారు. పలాస నియోజకవర్గంలో ఇప్పటి వరకూ చాలా చోట్ల 50 శాతం కూడా ఓటర్ల ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తి కాలేదని, సరైన సమాచారం అందకపోవడం, సాంకేతిక లోపాల వల్ల చాలా మంది అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను నింపడంలో ప్రజలకు అవగాహన లోపించడం, క్షేత్ర స్థాయిలో ఉన్న నిబంధనలు అర్థం కాకపోవడం వల్ల ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, చాలా ప్రాంతాల్లో బీఎల్ వో లు ఇళ్లకు వెళ్లి సర్ పత్రాలు ఇవ్వకపోవడం, సమయానికి నమోదు ప్రక్రియ పూర్తి చేయకపోవడం వంటి నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. అంతే కాకుండా విపక్షాల ఓట్లను తొలగించడానికి ఈ ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను మరో 3 నెలలపాటు పొడిగించి, అర్హులైన అందరూ ఓటు హక్కు పొందే విధంగా నిర్దిష్ట చర్యలు చేపట్టవలసిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకుడు వివి రమణమూర్తి పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సౌజన్య

**శ్రీకాకుళం, జులై 13(వార్త):** శ్రీకాకుళం ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు) ప్రిన్సిపాల్‌గా పి.సౌజన్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బారువ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఆమె శ్రీకాకుళం ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు) ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం ఆమె బాధ్యతలు చేపట్టారు. ఆమెకు కళాశాల అధ్యాపకులు , సిబ్బంది శుభాకాంక్షలను తెలియజేసారు. కార్యక్రమంలో సహచర ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొని ఆమెను అభినందించారు.

**కళాశాల అభివృద్ధికి కృషి చేయాలి : ఎమ్మెల్యే**

శ్రీకాకుళం ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు) అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్ సౌజన్యకి సూచించారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆమె ఎమ్మెల్యే గొండు శంకర్‌ను విశాఖ-ఏ కాలనీలో గల క్యాంపు కార్యాలయంలో ఆమె మర్యాధపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి కోసం పలు ప్రతిపాద నలను ఇప్పటికే స్థిం చేశామని, వాటిని పూర్తి చేసేందుకు తాను అన్ని విధాలుగా కృషి చేస్తున్నానన్నారు. నూతన ప్రిన్సిపాల్ సౌజన్యను ఆయన అభినందించారు.



## లెనిన్ చిత్రం విజయోత్సవం

**శ్రీకాకుళం, జులై 13(వార్త):** లెనిన్ చిత్రం విజయం సాధించిన సందర్భంగా శ్రీకాకుళం అక్కినేని అభిమానులు సంబరాలు చేసుకున్నారు. సూర్య మహల్ థియేటర్లో యజమాని రవి కేక్ కట్ చేశారు. థియేటర్ సిబ్బందికి స్వీట్ బాక్స్ ఫుడ్ ప్యాకెట్స్ ఇవ్వడం జరిగింది క్రాకర్స్ కాల్చుకొని సందడి చేశారు. జిల్లా ప్రెసిడెంట్ గురుచరణ్ మాట్లాడుతూ మా అభిమాన హీరో తన నట విశ్వరూపం ఈ సినిమా ద్వారా ప్రేక్షకులకు దేవుళ్లకు అభిమానులకు చూపించారు. ఇన్ని సంవత్సరాలు ఎదురు చూసినందుకు అభిమానులకి లాంటి చిత్రం ఇచ్చినందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతోష్ , అశోక్, ఉపేంద్ర, లక్ష్మణ, సీనియర్ ఫ్యాన్స్ బాబ్జి, సీజు, శ్రీను, మూర్తి, విజయ్, హరిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546